సాక్షి ఒడిశా

ఆదివారం । 10 । నవంబర్ । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం శనివారం లెక్కించారు. ఇందులో నగదు రూ.7,38,606లు, బంగారం 17.4 గ్రాములు వెండి 58 గ్రాముల 750 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



ఆర్థికాభివృద్ధిపై దృష్టి

పర్లాకిమిడి గజపతి స్టేడియంలో మత్స్య ప్రాణిసంపద మేళా జరిగింది. నాయకులు పాల్గొన్నారు. - 8లో



న్యాయసేవలపై అవగాహన

బమునిపుట్ హైస్కూల్‌లో న్యాయసేవలపై అవగాహన కల్పించారు. హక్కులు తెలుసుకోవాలన్నారు. - 8లో

న్యూస్‌రీల్

పుంగనూరు గోవులకు మంత్రి పూజలు



పుంగనూరు ఆవులకు పూజలు చేస్తున్న మంత్రి దంపతులు

భువనేశ్వర్: కార్తీక మాసం పవిత్ర గోపాష్టమి పురస్కరించుకుని రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి గోకులానంద మల్లిక్ గృహ ప్రవేశం చేశారు. ఈ సందర్భంగా నూతన గృహ ప్రవేశం పూజాదుల కోసం పొరుగు రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ నుంచి అత్యున్నత శ్రేణి పుంగనూరు జాతి ఆవుల జంటని రప్పించారు. వీటితో నిర్వహించిన గృహ ప్రవేశం కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. గృహ ప్రవేశం కోసం రప్పించిన ఈ ఆవుల జంటని తన ఇంట పోషించడం జరుగుతుందని మంత్రి ప్రకటించారు. వీటికి సురభి, కృష్ణ అని నామకరణం చేసినట్లు మంత్రి దంపతులు ప్రకటించారు.

న్యాయవాదుల ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న జడ్జి, న్యాయవాదులు

రాయగడ: జాతీయ న్యాయ సేవా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కోర్టు ప్రాంగణంలో జిల్లా జడ్జి సత్యనారాయణ షడంగి నేతృత్వంలో శనివారం న్యాయవాదులు ర్యాలీ నిర్వహించారు. కోర్టు ప్రాంగణం నుంచి డైలీ మార్కెట్ వరకు ర్యాలీ కొనసాగింది. పలువురు విద్యార్థులు కూడా పాల్గొన్నారు.

జగన్నాథ ఎక్స్‌ప్రెస్ బస్సు ప్రారంభం



బస్సులో మంత్రి నిత్యానంద, ఎమ్మెల్యే గౌరీ మఝిల ప్రయాణం

కొరాపుట్: నబరంగ్‌పూర్ నుంచి విజయవాడకు వెళ్లే ఓఎస్ఆర్‌టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సు సేవలను శనివారం నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి నిత్యానంద గోండో ప్రారంభించారు. ఈ ఓల్వో బస్సు ప్రతి రోజూ సాయంత్రం 3 గంటలకు నబరంగ్‌పూర్ నుంచి బయలుదేరి జయపూర్, కొరాపుట్, సాలూరు, విశాఖపట్నం మీదుగా విజయవాడ చేరుకుంటుంది. మరుసటి రోజు సాయంత్రం 3 గంటలకు విజయవాడలో బయలుదేరి తిరిగి నబరంగ్‌పూర్ చేరుకుంటుంది. మహిళలకు 50 శాతం తగ్గింపు ధరకే టిక్కెట్ ఇస్తారు. జగన్నాథ బస్సు సర్వీస్ పేరిట సుదూర ప్రాంతాలకు ఇటువంటి బస్సు సేవలు ప్రారంభిస్తున్నట్లు మంత్రి గొండో ప్రకటించారు. కార్యక్రమంలో నబరంగ్‌పూర్ ఎమ్మెల్యే గౌరీ శంకర్ మఝి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాప్య పింఛన్ కోసం వెళ్లి మహిళ మృతి



మృతదేహం వద్ద సోదరి సోమయి, (ఇన్‌సెట్లో) రోడ్డు మీద కాంత మెలక మృతదేహం

కొరాపుట్: వృద్ధాప్య పింఛన్ తీసుకోవడానికి వెళ్లిన మహిళ మృతి చెందిన విషాదకర ఘటన కొరాపుట్ జిల్లా బందుగాం సమితి బంసీపుట్‌లో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కాంత మెలక (83) అనే మహిళ వృద్ధాప్య పింఛన్ తీసుకోవడానికి తన గ్రామం నుంచి 7 కిలోమీటర్ల దూరంలో ఉన్న బందుగాం సమితి కేంద్రం ఉత్కళ గ్రామీణ బ్యాంక్‌కి తన పెద్ద చెల్లెలు సోమయితో కలిసి వెళ్లారు. కానీ దారిలోనే చలి ప్రభావానికి గురై సొమ్మసిల్లి పడిపోయారు.కాసేపటికే చనిపోయారని ఆమె చెల్లి తెలిపారు. దారిలోనే సోదరి చనిపోవడంతో ఏం చేయాలో పాలుపోక సోమయి దిక్కుతోచని స్థితిలో ఉండిపోయారు. ఆ దారిన వెళ్తున్న వారు వీరిని గమనించి సాయం చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వృద్ధాప్య పింఛన్ ఇంటికే తీసుకొచ్చి ఇవ్వాలి. కానీ ఈ ఇద్దరు వృద్ధులు ప్రతి నెలా కాలినడకన వచ్చి పింఛన్ తీసుకుంటున్నారని తెలియడంతో ఉన్నతాధికారులు దర్యాప్తునకు ఆదేశించారు. మృతదేహాన్ని ఇంటికి తరలించే ఏర్పాట్లు కూడా చేశారు.

కొరతను అధిగమించేలా..

- బంగాళాదుంప సాగు రైతులకు ప్రోత్సాహం
- మెరుగైన దిగుబడి దిశగా ప్రణాళికలు
- నాణ్యమైన విత్తనాలు సబ్సిడీపై ఇవ్వాలని ప్రభుత్వ నిర్ణయం



బంగాళా దుంపల విత్తనాల వినియోగ శిక్షణ



అధునాతన పద్ధతుల్లో బంగాళా దుంపల సాగు

భువనేశ్వర్: రాష్ట్రంలో ఏటా వేధిస్తున్న బంగాళా దుంపల కొరతను అధిగమించేందుకు ప్రభుత్వం ప్రణాళిక రచిస్తోంది. రాష్ట్ర ప్రజల నిత్య వినియోగానికి తగినంత ఉత్పాదన, నిల్వ రాష్ట్రంలోనే చేసుకునేలా రైతులను ప్రోత్సహించనుంది. సాగు ప్రణాళిక ఆధునీకీకరించి ఉత్పాదన, వినియోగంలో వ్యత్యాసం కుదించడం లక్ష్యంగా కొత్త కార్యాచరణకు శ్రీకారం చుట్టడం విశేషం. దీని కోసం నాణ్యమైన విత్తనాల్ని సరఫరా చేయాలని నిర్ణయించింది. పంటను ఏడాది పొడవునా నిల్వ ఉంచేందుకు సౌకర్యాలు అరకొరగా ఉండడంతో.. నిల్వ సామర్థ్యం పెరిగేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

సగటు వ్యక్తి వార్షిక వినియోగం 25 కిలో గ్రాములు

రాష్ట్రంలో బంగాళా దుంప నిత్య వంటకం. ఇటీవల నిర్వహించిన ఒక సర్వేలో రాష్ట్రంలో ఒక వ్యక్తి సగటు వార్షిక వినియోగం 25.4 కిలో గ్రాములుగా తేలింది. బ్లూ ప్రింట్ ఆఫ్ పొటాటో కల్టివేషన్ ఆఫ్ ఒడిశా శీర్షిక కింద నిర్వహించిన సర్వే ఈ విషయం వెల్లడించింది. స్థానిక ఓయూఏటీ ఉద్యాన విభాగం విరామ ప్రొఫెసరు డాక్టరు ప్రభు చరణ్ లెంకా ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖ విరామ సంయుక్త డైరెక్టరు అమరేశ్వర మిశ్రా, వ్యవసాయవేత్తలు అవినాష్ మహంతి, అభిజిత్ భట్టాచార్జీ ఈ సర్వే నిర్వహించారు. ఈ ఏడాది జూన్, జులై నెలలో 10 ఆగ్రో క్లైమాటిక్ జోన్లలో ఈ సర్వే నిర్వహించారు.

ఉత్పాదన అల్పం

రాష్ట్రంలో ఒక్కో వ్యక్తి వార్షిక సగటు వినియోగం 25.4 కిలో గ్రాములుగా ఈ వర్గం నిర్ధారించింది. ఈ లెక్క ప్రకారం రాష్ట్రంలో 4.2 కోట్ల జనాభా కోసం ఏటా 10.66 లక్షల మెట్రిక్ టన్నుల బంగాళా దుంపల ఉత్పాదన అవసరం. దీనికి తగినట్లు ఉత్పాదన పుంజుకోవడం లేదు. రాష్ట్రంలో నామ మాత్రంగా 20 శాతం మాత్రమే ఉత్పాదన సాధ్యమవుతోంది. రాష్ట్రంలో బంగాళా దుంపల సగటు వార్షిక ఉత్పాదన 2.5 లక్షల మెట్రిక్ టన్నులకు పరిమితం అవుతోంది. మిగిలిన అవసరాల కోసం పొరుగు రాష్ట్రం పశ్చిమ బెంగాల్‌పై ఆధారపడాల్సి వస్తుంది.

రైతులకు ప్రోత్సాహం

బంగాళా దుంప సాగు రైతులకు ప్రభుత్వం ప్రత్యేక సబ్సిడీలతో ప్రోత్సహిస్తోంది. అర ఎకరంలో సాగు కోసం అవసరమైన నాణ్యమైన విత్తనాల్ని సబ్సిడీ ధరలకు ప్రభుత్వం సరఫరా చేస్తుంది. పంట సంరక్షణ వ్యయంలో కూడా ప్రభుత్వం తోడ్పాటు అందిస్తుంది. ఈ సమగ్ర సన్నాహాలు రబీ బంగాళా దుంపల కార్యక్రమం – 2024 కింద నిర్వహిస్తారు.

నాణ్యత గుర్తింపు

వ్యవసాయ నిపుణుల ప్రత్యక్ష పర్యవేక్షణలో నాణ్యమైన బంగాళా దుంపల విత్తనాల్ని ధ్రువీకరించారు. రబీ సీజను సాగు పురస్కరించుకుని రైతులకు సరఫరా చేస్తారు. ఒడిశా వ్యవసాయ, సాంకేతిక విశ్వ విద్యాలయం ఓయూఏటీ ఆధ్వర్యంలో విత్తనాల నిపుణులు ధ్రువీకరణ కార్యకలాపాలు ప్రత్యక్షంగా చేపడుతున్నారు. ఈ ప్రయాసతో అవసరాలకు అనుగుణంగా స్థానికంగా బంగాళా దుంపల సాగు సాధ్యమవుతుందని భావిస్తున్నారు.

తాజా వ్యవసాయ పద్ధతులు

ఈ ఏడాది బంగాళా దుంపల సాగులో అధునాతన విధానాల్ని అవలంబించేందుకు సన్నాహాలు ప్రారంభమయ్యాయి. దీని పట్ల రైతులను చైతన్య పరిచేందుకు వివిధ ప్రాంతాల్లో విత్తనాల ఎంపిక, నాటడం, మొలకల్ని సంరక్షించి పంట దిగుబడి మెరుగుదల మెలకువలపై అవగాహన కార్యక్రమాల్ని పలు ప్రాంతాల్లో ప్రారంభించారు. పంట దిగుబడి గణనీయంగా పెంపొందించేందుకు అధునాతన సాగు ప్రణాళికతో రైతాంగం నైపుణ్యాలను సాన పెడుతున్నారు. ఈ ప్రక్రియలో వ్యవసాయ శాఖ రైతులకు మార్గదర్శిగా వ్యవహరిస్తుంది.



బంగాళా దుంపల సాగు మెలకువ శిక్షణ



వ్యవసాయ నిపుణుల ఆధ్వర్యంలో బంగాళా దుంపల విత్తనాల నాణ్యత పరిశీలన

రాష్ట్రంలో బంగాళా దంపల సాగుకు రబీ సీజను అనుకూలం. రాష్ట్ర స్థాయిలో 15 వేల హెక్టార్ల పైబడిన పొలాల్లో బంగాళా దుంపల సాగు చేస్తున్నారు. కొన్ని జిల్లాలు ఈ సాగుకు అనుకూలిస్తున్నాయి. పూరీ, కటక్, కంధమల్, మయూర్‌భంజ్, బాలాసోర్, సంబలపూర్, సుందరగడ్, కేంద్రాపడా మరియు కొరాపుట్ జిల్లాలు బంగాళా దుంపల సాగుకు అనుకూలించే ప్రాంతాలు. ఇటీవల ఖరీఫ్ సీజన్‌లో కూడ బంగాళా దుంపల సాగు ఆరంభించారు. కొరాపుట్ వంటి కొంచ చరియ ప్రాంతాల్లో ఈ సాగు సత్ఫలితాల్ని అందజేస్తోంది. కుఫ్రీ జ్యోతి రకం బంగాళా దుంపలు రాష్ట్రంలో అధికంగా ఉత్పత్తి అవుతున్నాయి. ఈ రకపు బంగాళా దుంపలు హెక్టారుకు 12 టన్నుల వరకు ఉత్పత్తి అవుతున్నాయి. సాధారణంగా కొన్ని ప్రాంతాల్లో జులై నుంచి నవంబరు మరికొన్ని ప్రాంతాల్లో నవంబరు నుంచి మార్చి నెల వరకు బంగాళా దుంపల సాగుకు అనుకూలమైన సమయం.

కొరతతో ధరల పెరుగుదల

రాష్ట్రంలో బంగాళా దుంపల అరకొర ఉత్పాదనతో ధరలు గణనీయంగా పెరుగుతున్నాయి. ఏటా సగటున కిలో బంగాళా దుంప రిటైలు దర రూ. 50 నుంచి 60 వరకు పలుకుతుంది. ప్రభుత్వ ప్రోత్సాహంతో ఔత్సాహిక రైతాంగం ఆధ్వర్యంలో ఒక్కో హెక్టారు విస్తీర్ణపు బంగాళా దుంపల సాగు కోసం ఒక్కో రైతు రూ. 1 లక్ష 40 వేలు నుంచి 1 లక్ష 50 వేల వరకు వెచ్చించాల్సి ఉంటుంది.

కోటి దీపాల వెలుగులు



ప్రజా ప్రతినిధులను సన్మానిస్తున్న దృశ్యం



సాంస్కృతిక కార్యక్రమాల్లో నృత్య ప్రదర్శనలు

రాయగడ: కోటి దీపారాధనోత్సవాల్లో భాగంగా జిల్లాలోని గుణుపూలో కార్తీక శోభ సంతరించుకుంది. బగువా మైదానంలో శుక్రవారం ప్రారంభమైన దీపారాధనోత్సవాలతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. కలశ యాత్రతో పూజా కార్యక్రమాలు ప్రారంభం కాగా.. సాయంత్రం గణనాథుని కళ్యాణోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. అనంతరం సామూహిక సత్యనారాయణ వ్రతాలు చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు రాయగడ ఎమ్మెల్యే అప్పల స్వామి కద్రక, గుణుపూర్ ఎమ్మెల్యే సత్యజీత్ గొమాంగొ, బిసంకటక్ ఎమ్మెల్యే నీలమాధవ హికకలతొ పాటు గుణుపూర్ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ శివప్రసాద్ గొడొ తదితర ప్రముఖులను సత్కరించారు.

సెంచూరియన్ వర్సిటీలో క్యాంపస్ డ్రైవ్

పర్లాకిమిడి: ఆర్.సీతాపురం సెంచూరియన్ వర్సిటీలో శనివారం జరిగిన క్యాంపస్ డ్రైవ్‌లో 16 మంది బీఎస్సీ అగ్రికల్చరల్ విద్యార్థులు ఐటీసీ కంపెనీకి ఎంపికైనట్లు డిప్యూటీ రిజిస్ట్రారు(ప్లేస్‌మెంట్) ఎస్.కామేశ్వరరావు తెలిపారు. వీరికి వార్షిక వేతనం రూ.4.0 లక్షలుగా టాటా కంపెనీ నిర్ణయించినట్టు తెలియజేశారు. అలాగే విల్సన్ అగ్రిసైన్స్ కంపెనీకి 14 మంది బీఎస్సీ విద్యార్థులు, అక్షయకల్ప ఫార్మ్స్ అండ్ ఫుడ్స్ కంపెనీకి 26 మంది ఎంపికైనట్టు అధికారులు ప్రకటించారు. ఇవికాక మరో 25 మంది కూడా పలు కంపెనీలకు ఎంపికయ్యారని పేర్కొన్నారు. విద్యార్థులకు వర్సిటీ ఉపాధ్యక్షులు డీఎన్ రావు, రిజిస్ట్రార్ అనిత పాత్రో, ఉపకులపతి డాక్టర్ సుప్రియా పట్నాయిక్, ప్రొఫెసర్ సాగర్ మైత్రాలు అభినందించారు.



టాటా ఐటీసీలో ఎంపికైన విద్యార్థులకు అభినందనలు తెలుపుతున్న ప్రొఫెసర్ సాగర్ మైత్రా

పట్టాలు తప్పిన సికింద్రాబాద్-షాలిమార్ ఎక్స్‌ప్రెస్



పట్టాలు తప్పిన రైలు బోగీ చక్రం



పట్టాల పక్కకు ఒరిగిన రైలు

హెల్ప్ డెస్క్	ఫోన్ నంబరు
షాలిమార్	6295531471
సంత్రాగచ్చి	9831243655, 8910261621
ఖరగ్‌పూర్	0322293764
హౌరా	7595074714



పట్టాలు తప్పిన సికింద్రాబాద్ - షాలిమార్ ఎక్స్‌ప్రెస్ రైలు



పట్టాలు తప్పిన పార్సిల్ వ్యాగను

భువనేశ్వర్: ఆగ్నేయ రైల్వే జోన్ పరిధిలో సికింద్రాబాద్-షాలిమార్ ఎక్స్‌ప్రెస్ రైలు(22850) శనివారం ఉదయం 5.31 గంటల ప్రాంతంలో పట్టాలు తప్పింది. హౌరా సమీపంలో నలాపూర్ ప్రాంతంలో ఈ రైలు రెండు ప్రయాణికుల బోగీలు పట్టాలు తప్పాయి. ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని ఆగ్నేయ రైల్వే అధికార వర్గాలు తెలిపాయి. కొందరు ప్రయాణికులు స్వల్పంగా గాయపడగా.. వీరికి సత్వర చికిత్స అందజేశారు. మరో పార్సిల్ వ్యాగన్ కూడా పట్టాలు తప్పింది. రైల్వే అధికారులు ఘటనా స్థలం సందర్శించి సహాయ, పునరుద్ధరణ పనులు యుద్ధ ప్రాతిపదికన నిర్వహిస్తున్నారు. ప్రమాద స్థలం మార్గం గుండా రైళ్ల రాకపోకలకు స్వల్ప అంతరాయం ఏర్పడింది. సంప్రదింపుల కోసం సహాయ శిబిరాల్ని ఏర్పాటు చేశారు. షాలిమార్, సంత్రాగచ్చి, ఖరగ్‌పూర్ మరియు హౌరా ప్రాంతాల్లో హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేశారు.

లాయర్‌పై యాసిడ్ దాడి



న్యాయవాది పి.రామారావును ఆస్పత్రికి తరలించిన దృశ్యం



గాయపడిన రామారావు

పర్లాకిమిడి: సీనియర్ న్యాయవాది పత్తి రామారావుపై ఇద్దరు అగంతకులు యాసిడ్‌తో దాడి చేసి పరారయ్యాడు. శనివారం సాయంత్రం 4.30 గంటల సమయంలో జంగం వీధిలో నివాసం ఉంటున్న పత్తి రామారావు ఇంటికి ఇద్దరు అగంతకులు వెళ్లి తలుపు కొట్టి బయటకు పిలిచారు. రామారావు బయటకు రాగానే ఆయనపై యాసిడ్‌తో దాడి చేసి పరారయ్యారు. ఏదో కేసుపై మాట్లాడతామని అగంతకులు వచ్చినట్లు క్షతగాత్రుడు రామారావు తెలిపారు. పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చి కేసు నమోదు చేశారు. రామారావుకు ముఖం, శరీరంపై గాయాలు కాగా.. తొలుత ప్రభుత్వాస్పత్రికి తరలించి అనంతరం సరా నేత్రాలయానికి పంపించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం విశాఖపట్నం తరలించినట్లు న్యాయవాదులు తెలిపారు. ఈ ఘటనను బార్ అసోసియేషన్ సభ్యులు ఖండించి నిరసన తెలిపారు.

విజిలెన్స్ వలలో ఆస్పత్రి సిబ్బంది



విజిలెన్స్ వలలో చిక్కిన డాక్టర్ భుయ, ఫార్మసిస్టు మహంకుడొ



బొయిపరిగుడ కమ్యూనిటీ ఆస్పత్రి

జయపురం: ఒక కాంట్రాక్ట్ ఉద్యోగికి అవసరమైన క్లియరెన్స్ సర్టిఫికెట్ ఇచ్చేందుకు రూ.40వేలు లంచం తీసుకుంటూ.. జయపురం సబ్‌డివిజన్ బొయిపరిగుడ కమ్యూనిటీ హాస్పిటల్ వైద్యాధికారి విశ్వజిత్ భుయ, ఎంహెచ్‌యూలో ఫార్మసిస్టు ఉత్తమ మహంకుడొలు జయపురం విజిలెన్స్ అధికారులకు దొరికిపోయారు. బొయిపరిగుడ కమ్యూనిటీ ఆస్పత్రిలో ఒక మహిళా కాంట్రాక్ట్ ఉద్యోగిని నియమించేందుకు ఆస్పత్రి డాక్టర్ క్లియరెన్స్ సర్టిఫికెట్ అవసరమైంది. సర్టిఫికెట్ కోసం రూ.40 వేలు డిమాండ్ చేశారు. వీరి మధ్య ఫార్మసిస్టు ఉత్తమ మహంకుడో మధ్యవర్తిగా వ్యవహరించాడు. దీంతో ఆ మహిళ జయపురం విజిలెన్స్ అధికారులను ఆశ్రయించారు. లంచం అడిగిన వారిని పట్టుకునేందుకు విజిలెన్స్ అధికారులు వల పన్నారు. ముందు పథకం ప్రకారం శుక్రవారం సాయంత్రం మహిళా ఫార్మసిస్టుకు రూ.40 వేలు అందజేసింది. ఆ సమయంలో అక్కడే మాటు వేసి ఉన్న విజిలెన్స్ సిబ్బంది దాడి చేసి ఫార్మసిస్టు నుంచి డబ్బు సీజ్ చేశారు. ఫార్మసిస్టు వెల్లడించిన వివరాల మేరకు డాక్టర్ విశ్వజిత్ భుయను కూడా అదుపులోనికి తీసుకొని జయపురం విజిలెన్స్ కార్యాలయానికి తీసుకు వచ్చి విచారిస్తున్నారు. ఈ దాడిలో విజిలెన్స్ డీఎస్పీ సదానంద పాణి, అజయ ప్రధాన్, జయశ్రీ ప్రధాన్, ఇన్‌స్పెక్టర్ సంజయ ప్రధాన్, సావిత్రి ప్రధాన్, అనుభవ దాస్ పాల్గొన్నారు.

దుండగుల దుశ్చర్య!

- మామూళ్ల కోసం బాంబు దాడి
- దెబ్బతిన్న జేసీబీ



బాంబు దాడిలో దెబ్బతిన్న జేసీబీ వాహనం

భువనేశ్వర్: కాంట్రాక్టర్ నుంచి మామూళ్ల వసూలు కోసం దుండగులు దుశ్చర్యకు పాల్పడ్డారు. వంతెన నిర్మాణం పనులు చేపడుతున్న కాంట్రాక్టరు నుంచి డబ్బులు వసూలు చేసే పన్నాగంలో భాగంగా ఆయన్ని భయపెట్టేందుకు బాంబుదాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో కాంట్రాక్టర్‌కు చెందిన జేసీబీ వాహనం దెబ్బ తింది. కటక్ నగరం కొంయిముండి కూడలి ప్రాంతంలో శుక్రవారం రాత్రి సమయంలో ఈ సంఘటన చోటు చేసుకుంది. సమాచారం అందుకున్న బంకి ఠాణా పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి విచారణ చేపట్టారు. పరారైన దుండగల కోసం గాలింపు చర్యలు చేపడుతున్నామని పోలీసులు చెప్పారు.

బిర్సా ముండా జయంత్యుత్సవాలకు భారీ ఏర్పాట్లు

- ప్రధాన మంత్రి రాక
- గ్రామ సభల నిర్వహణకు సన్నాహాలు



బిర్సా ముండా

భువనేశ్వర్: ప్రముఖ దళిత స్వాతంత్ర సమర యోధుడు బిర్సా ముండా 150వ జయంతిని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం భారీ స్థాయిలో ప్రత్యేక కార్యక్రమాల నిర్వహణకు సన్నాహాలు చేస్తోంది. ఈ నెల 15న బిర్సా ముండా జయంతి. ఏడాది పొడవునా బిర్సా ముండా జయంత్యుత్సవాలు నిరవధికంగా కొనసాగించేందుకు పంచాయితీ రాజ్ విభాగం కార్యక్రమాలు ఖరారు చేసింది. ఈ సందర్భంగా భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ రాష్ట్ర పర్యటనకు విచ్చేయనున్నారు. బిర్సా ముండా 150వ జయంతి పురస్కరించుకుని ప్రభుత్వం జన జాతీయ గౌరవ దినంగా ప్రకటిస్తుందని పంచాయితీ రాజ్ శాఖ మంత్రి రబి నారాయణ నాయక్ తెలిపారు. రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో పలు ఆకర్షణీయ కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నట్లు ఆయన వివరించారు. రాష్ట్రంలో 27 దళిత ప్రభావిత జిల్లాల్లో ఈ వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. వీటిలో 7 దళిత ప్రభావిత సరిహద్దులో ఉన్నాయని తెలిపారు.

గ్రామ సభలు

ఈ జిల్లాల్లో 234 మండలాల 2,408 పంచాయితీల్లో 6 వేల 667 గ్రామ సభలు నిర్వహిస్తున్నారు. గ్రామ సర్పంచ్‌ల ఆధ్వర్యంలో గ్రామ సభలు నిర్వహిస్తారు. పంచాయతీ ఎక్స్‌టెన్షన్ అధికారులు పీఈఓ సమన్వయకర్తలుగా వ్యవహరిస్తారు. ఈ సభల్లో గ్రామస్తులకు పంచాయతీ హక్కులు, అటవీ హక్కులపై అవగాహన కల్పించడం ధ్యేయంగా పేర్కొన్నారు.

మాధో సింఘ్ హాథ్తా ఖొర్చా పథకం

బిర్సా ముండా 150వ జయంతి పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం మాధో సింఘ్ హాథ్తా ఖొర్చా (మాధోసింఘ్ చేతి ఖర్చులు) పథకం ప్రారంభించనుంది. భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ లాంఛనంగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. ఈ పథకం కింద దళిత విద్యార్థులకు చేతి ఖర్చుల కోసం ప్రత్యేక భృతి మంజూరు చేస్తారు. సుందరగడ్ జిల్లా నుంచి భారత ప్రధాన మంత్రి ఈ పథకం ఈ నెల 15న ప్రారంభిస్తారు.

క్లుప్తంగా

జాతీయస్థాయి బ్యాడ్మింటన్ అంపైర్‌గా మోహన్‌సాయి


ఎస్.మోహన్‌సాయి

శ్రీకాకుళం న్యూకాలనీ: చెన్నైలో నిర్వహించిన జాతీయ స్థాయి అంపైర్ పరీక్షలో ఎచ్చెర్ల మండల పరిధిలోని షేర్‌మహ్మద్‌పురం గ్రామానికి చెందిన మోహన్ సాయి బ్యాడ్మింటన్ జాతీయ స్థాయి అంపైర్‌గా అర్హత సాధించాడు. థియరీ, ప్రాక్టికల్ పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించాడు. ప్రస్తుతం ఉన్న జాతీయ స్థాయి అంపైర్‌లలో మోహన్‌సాయి అత్యంత పిన్న వయస్కుడు. ఇతని తండ్రి సంపతిరావు సూరిబాబు ఇంటర్నేషనల్ రిఫరీగా ఐదేళ్ల క్రితమే అర్హత సాధించారు. మోహన్‌సాయి అర్హత సాధించడం పట్ల ఏపీబీఏ ప్రధాన కార్యదర్శి డాక్టర్ పి.అంకమ్మచౌదరి, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కిల్లంశెట్టి సాగర్, మెట్ట అశోక్‌కుమార్, చీఫ్ పేట్రన్ డాక్టర్ గూడేన సోమేశ్వరరావు, సీఈఓ సంపతిరావు సూరిబాబు, గురుగుబెల్లి ప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు.

కీర్తిచక్ర అవార్డు గ్రహీతకు సన్మానం


రామ్‌గోపాల్‌నాయుడు దంపతులను సన్మానిస్తున్న స్థానికులు

సంతబొమ్మాళి: సంతబొమ్మాళి పంచాయతీ నగిరిపెంట గ్రామానికి చెందిన కీర్తి చక్ర అవార్డు గ్రహీత మేజర్ మల్ల రామ్‌గోపాల్‌నాయుడుకు గ్రామస్తులు శనివారం పౌర సన్మానం చేశారు. మేజరు దంపతులకు శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత దేశసేవలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పేడాడ గోవిందరావు, స్థానికులు ముద్దపు లక్ష్మన, మల్ల రాజు, సనపల లచ్చన్న, చిన్న బాబు తదితరులు ఉన్నారు.

నేడు జిల్లా స్థాయి పోటీలు

శ్రీకాకుళం అర్బన్: రోటరీ క్లబ్ శ్రీకాకుళం, శరత్‌చంద్ర అకాడమీ(విజయవాడ), ఇన్‌స్పైరా అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో శ్రీకాకుళం నగరంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో ఇన్‌స్పైరా పాఠశాలలో ఆదివారం జిల్లా స్థాయి చిత్రలేఖనం, సోలో స్పెషల్ టాలెంట్(నృత్యం, సంగీతం కాకుండా ఇతర అన్నీ) పోటీలు నిర్వహిస్తున్నామని రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ముని శ్రీనివాసరావు, దూసి సంతోష్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. చిత్రలేఖన పోటీలకు అవసరమైన మెటీరియల్‌ను నిర్వాహకులే అందజేస్తారని, 8 నుంచి 15 ఏళ్ల వయసు గల విద్యార్థులు పాల్గొనవచ్చని పేర్కొన్నారు. విజేతలకు ఈ నెల 14న బాలల దినోత్సవం సందర్భంగా బహుమతులు ప్రదానం చేస్తామని తెలిపారు. పూర్తి వివరాలకు కోఆర్డినేటర్ అన్నెపు అనంతరావు(70937 74050, 7075755060)ను సంప్రదించాలని కోరారు.

కందిపప్పు సరఫరాలో గోల్‌మాల్!

నరసన్నపేట: మండలంలోని చెన్నాపురంలో 244 నంబర్ రేషన్ డిపోలో కందిపప్పును చాలామంది కార్డుదారులకు ఇవ్వకుండా కూటమి నాయకులే అమ్ముకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. నవంబర్‌కు సంబంధించి కార్డు దారులకు కేజీ చొప్పున ప్రభుత్వం డిపోకు 381 కేజీల కందిపప్పును కేటాయించింది. అయితే వంద కేజీలకు పైగా కందిపప్పును కార్డుదారులకు కాకుండా వ్యాపారులకు అమ్ముకున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. గతంలో ఇక్కడి డిపో డీలరును తొలగించి కూటమి ప్రభుత్వం వచ్చాక స్వయం శక్తి సంఘానికి నిర్వహణ బాధ్యతలు అప్పగించారు. దీనిని స్థానిక కూటమి కార్యకర్తలే నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో గ్రామానికి చెందిన సడగల సాయిరాజ్, కొంక్యాన అనసూయమ్మ, బడ్డి రాజులమ్మ, బడ్డి రమణమ్మ తదితరులు మాట్లాడుతూ తమకు బియ్యం, పంచదారే ఇచ్చారని, కందిపప్పు ఇవ్వలేదని తెలిపారు. కందిపప్పు అడిగితే అయిపోయిందని చెబుతున్నారని వాపోయారు. ఈ విషయమై సివిల్ సప్లయ్ డీటీ రామకృష్ణ వద్ద ప్రస్తావించగా కందిపప్పు పంపిణీపై ఆరా తీశామని, స్థానిక వీఆర్వోను కూడా ప్రశ్నించామని, పలువురు లబ్ధిదారులు తమకు కందిపప్పు ఇవ్వలేదని వీఆర్వో దృష్టికి తీసుకెళ్లారని చెప్పారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఆన్‌లైన్‌లో 2500 కోర్సుల పూర్తి

శ్రీకాకుళం అర్బన్/శ్రీకాకుళం కల్చరల్: రెండేళ్ల పాటు నిరంతరాయంగా చదువుతూ ఆన్‌లైన్‌లో ప్రఖ్యాత సంస్థలు అందిస్తున్న 2,500 కోర్సులను పూర్తి చేసి నాలుగు ప్రపంచ రికార్డులు సాధించిన ఎంవీఎస్ఎస్ శాస్త్రి యువతకు స్ఫూర్తిదాయకమని పలువురు వక్తలు పేర్కొన్నారు. నగరంలోని 80 అడుగుల రోడ్డులోని ఓ హోటల్లో శనివారం శాస్త్రి దంపతులను సత్కరించారు. ఈ సందర్భంగా నగర ప్రముఖులు సురంగి మోహన్‌రావు, బరాటం లక్ష్మణరావు, ఎం.ప్రసాదరావు, వావిలపల్లి జగన్నాథంనాయుడు, కొంక్యాన వేణుగోపాల్, జామి భీమశంకర్, మహిబుల్లాఖాన్, ఎం.ఎస్.ఎస్.గుప్తా తదితరులు మాట్లాడుతూ లోక్‌సత్తా సంస్థ నుంచి గాంధీ మందిరం స్వాతంత్ర్య సమరయోధుల స్మృతివనం నిర్మాణం వరకు శాస్త్రి ప్రస్థానంలో నిరంతర శ్రమ, అంకితభావం, పట్టుదల కనిపిస్తాయన్నారు. 2,500 ఆన్‌లైన్ కోర్సులు పూర్తి చేసి ప్రఖ్యాత సంస్థలు, యూనివర్శిటీల నుంచి ధ్రువపత్రాలు పొందడం సామాన్య విషయం కాదన్నారు. చదువుకు వయస్సుతో సంబంధం లేద నిరూపించారన్నారు. అనంతరం శాస్త్రి మాట్లాడుతూ స్నేహితులు, కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతోనే ఇది సాధ్యపడిందన్నారు.

పాడి, మత్స్యకారుల ఆర్థికాభివృద్ధిపై దృష్టి


సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి


పాడి రైతుకు చెక్కును అందజేస్తున్న పురపాలక అధ్యక్షురాలు నిర్మలా శెఠి

పర్లాకిమిడి: మత్స్య, పాడి పరిశ్రమదారులు ఆర్థిక అభివృద్ధికి సొంతంగా ఫార్మ్‌లు నడపాలని విశ్రాంత ముఖ్య ప్రాణిచికిత్సా అధికారి, వైజ్ఞానికులు దీనబంధు మిశ్రా (సంబల్‌పూర్) అన్నారు. శనివారం గజపతి స్టేడియంలో జరిగిన జిల్లా స్థాయి మత్స్య, ప్రాణిసంపద మేళా ముగింపు సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల కోసం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. సమావేశంలో ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి, వెటర్నరీ ఆదనపు డైరెక్టర్ డంభురధర సామల్, సబ్ కలెక్టర్ అనుప్ పండా, ఆర్.ఉదయగిరి సమితి అధ్యక్షులు లక్ష్మీనారాయణ శోబోరో, పురపాలక అధ్యక్షురాలు నిర్మలా శెఠి, జిల్లా ముఖ్య ప్రాణిచికిత్సా అధికారి తుషార్ రంజన్ సాహు, విశ్రాంత సీడీవీవో గిరీష్ మహంతి, జెడ్పీటీసీ ఎస్.బాలరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పశు, కోళ్లఫార్మ్‌లు, చేపల పెంపకంలో ఉత్తమ ఫలితాలు సాధించిన మహిళా స్వయం సహాయక గ్రూపులు, రైతులకు ప్రోత్సాహకాల చెక్కులను సబ్ కలెక్టర్ పండా అందజేశారు. అనంతరం పాడిపరిశ్రమ, మత్స్యకారులకు ఉపయోగపడే రూపకాలను నృత్య రూపనంలో ప్రదర్శించారు. జిల్లా మత్స్యశాఖ అధికారి లిసా బెహారా హాజరయ్యారు.


మహిళా స్వయం సహాయక గ్రూపులకు చెక్కు అందజేస్తున్న అధికారులు


చేపల పెంపకం రైతుకు ప్రోత్సాహక చెక్కు అందజేస్తున్న సబ్‌కలెక్టర్ పండా

న్యాయసేవలపై అవగాహన


ప్రసంగిస్తున్న సుమన్ జెన తదితరులు

జయపురం: కొరాపుట్ జిల్లా న్యాయ సేవా ప్రదీకరణ జయపురం వారు శనివారం జాతీయ న్యాయ సహాయక దినోత్సవం నిర్వహించారు. జిల్లా న్యాయ సేవా ప్రదీకరణ అధ్యక్షుడు ప్రదీప్ కుమార్ మహంతి పర్యవేక్షణలో జయపురం సమితి బమునిపుట్ ఉన్నత పాఠశాలలో కార్యక్రమం నిర్వహించారు. న్యాయ సేవా ప్రదీకరణ జిల్లా కార్యదర్శి, లోక్ అదాలత్ శాశ్వత విచారపతి సుయన్ జెన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ప్రజల్లో న్యాయ సచేతన, ఉచిత న్యాయం అందించేందుకు ఒక ప్లాట్‌ఫారం ఏర్పాటు చేయటమే జాతీయ న్యాయ సహాయక దినం ప్రధాన లక్ష్యమని అన్నారు. ప్రజలకు తమ హక్కులపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రత్యేక విజిలెన్స్ కోర్టు, జయపురం ప్రత్యేక ప్రభుత్వ న్యాయవాది డాక్టర్ బి.గాయిత్రీ దేవి, సిఫ్ లీగల్ డిఫెన్స్ కౌన్సిలర్ హరిశ్చంద్ర ముదులి, పి.సన్యాసిరావు, దివాకర గౌఢ, బినయ బిశ్వాస్, సురేష్ హ్యడువు తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

దొంగతనం కేసులో నలుగురు అరెస్టు


పోలీసుల అదుపులో నిందితులు

రాయగడ: జాతీయ రహదారి మలుపుల వద్ద ఎటువంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా ఉండేందుకు ఎన్‌హెచ్ విభాగం ఏర్పాటు చేసిన సిల్వర్ రేకుల దొంగతనం కేసును చందిలి పోలీసులు ఛేదించారు. ఈ కేసులో నలుగురు నిందితులను శుక్రవారం అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో అరవింద్‌నగర్‌కు చెందిన రాజాఖాన్, నువాపడకు చెందిన రోహిత్ నాయక్, హలదీపాదొర ప్రాంతానికి చెందిన అజిత్ హియాల్, స్క్రాప్ వ్యాపారి పి.శ్రీనివాస్‌లు ఉన్నారు. ఈ కేసుకు సంబంధించి పోలీసులు తెలియజేసిన వివరాల ప్రకారం.. కొద్ది రోజులుగా ఎన్‌హెచ్ మార్గంలోని సేఫ్టీ సిల్వర్ రేకులు మాయమవుతున్నట్లు గుర్తించిన మహేశ్వర్ హికక అనే వ్యక్తి చందిలి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసారు. ఈ మేరకు దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితులను అరెస్టు చేసి వారి నుంచి ఐదు క్వింటాళ్ల సిల్వర్ రేకులను స్వాధీనం చేసుకున్నారు.

విద్యార్థి మృతిపై దర్యాప్తు


అంబులెన్సులో మృతదేహాన్ని తరలిస్తున్న దృశ్యం

రాయగడ: కాసీపూర్ సమితి చంద్రగిరి సదరు పంచాయతీలోని ఆశ్రమ పాఠశాలలో నాలుగో తరగతి విద్యార్థి కున్నా జొడియా ఆత్మహత్య మిస్టరీని ఛేదించేందుకు పోలీసులు రంగంలోకి దిగారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొరాపుట్‌లోని ఎంకేసీజీ ఆస్పత్రికి శనివారం తరలించారు. ఆశ్రమ పాఠశాల గదిలో మంచానికి తువ్వాలు కట్టి విద్యార్థి బలవన్మరణానికి పాల్పడిన సంగతి తెలిసిందే. అయితే విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడా, హత్య జరిగిందా అన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

పట్టపగలు చోరీ


ఇంటి యజమాని గానుగుల రవి

పర్లాకిమిడి: స్థానిక మెడికల్ రోడ్డు ఫ్రెండ్స్‌కాలనీలో శనివారం ఒక ఇంటిలో పట్టపగలే చోరీ జరిగింది. నాలుగు తులాల బంగారం, రూ.రెండు లక్షల నగదు కాజేసినట్లు ఇంటి యజమాని గానుగుల రవి స్థానిక మోడల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆయన ఉదయం 10 గంటల సమయంలో ఆటోలో తన తల్లితో పాతపట్నంకు వెళ్లి తిరిగి మూడు గంటల సమయంలో ఇంటికి వచ్చారు. పెరటి తలుపు తెరచి ఉండటం గమనించి బెడ్ రూంలో చూడగా అల్మరా తెరిచి ఉంది. అందులో దాచి ఉంచిన చిట్ సొమ్ము రూ.రెండు లక్షలు, నాలుగు తులాల బంగారం పోయినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న ఆదర్శ పోలీసు స్టేషన్ ఐఐసీ ప్రశాంత్ భూపతి ఫ్రెండ్స్ కాలనీ ఫస్టులైన్‌కు వచ్చి దర్యాప్తు చేశారు.

50 లీటర్ల నాటు సారా స్వాధీనం


నాటుసారాతో పట్టుబడిన నిందితుడు

రాయగడ: నాటుసారాను అక్రమంగా తరలిస్తున్న ఒక వ్యక్తిని జిల్లాలోని చందిలి పోలీసులు శుక్రవారం సాయంత్రం అరెస్టు చేశారు. వాహన తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు ఈ మేరకు ముకుందపూర్ నుంచి చందిలి వైపు వసున్న ఒక బైకును ఆపి తనిఖీ చేయగా అందులో 50 లీటర్ల నాటుసారా పట్టుబడింది. సారాను స్వాధీనం చేసుకొని నిందితుడిని కోర్టుకు తరలించినట్టు పోలీసులు తెలిపారు.

మహిళా కాలేజీలో మాక్‌డ్రిల్


జాతీయ విపత్తులపై మాట్లాడుతున్న మహిళా డిగ్రీకళాశాల ప్రిన్సిపల్ రీనా సాహు


విద్యార్థులకు విపత్తుల సమయంలో తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పిస్తున్న ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది

పర్లాకిమిడి: స్థానిక మహిళా డిగ్రీ కళాశాలలో శనివారం జాతీయ విపత్తుల రెస్పాన్స్ ఫోర్స్ ఆధ్వర్యంలో ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు ఎలా ఎదుర్కోవాలో మాక్‌డ్రిల్ నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్‌డీఆర్‌ఎఫ్ కమాండెంట్ బినయ పండా నేతృత్వంలో జిల్లా విపత్తులు, అత్యవసర అధికారి అజిత్ పాత్రో బృందం పాల్గొంది. వరదలు, తుఫానులు, భూకంపం, లాండ్ స్లయిడ్ దుర్ఘటనలు ఎదురైతే తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. అగ్నిప్రమాదాలు, గ్యాస్ లీక్‌లో తీసుకోవాల్సిన ప్రాథమిక చికిత్సపై కూడా ఎన్‌డీఆర్.ఎఫ్. అధికారులు విద్యార్థులకు అవగాహన కల్పించారు.

ఇంట్లో చొరబడి.. పెట్రోల్ పోసి బెదిరించి!

- విశాఖ వ్యక్తులతో కలిసి అలజడి సృష్టించిన చిట్స్ సంస్థ మేనేజర్
- పోలీసులను ఆశ్రయించిన బాధితులు


దంపతులను బెదిరిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా కేంద్రంలోని ప్రకాష్‌నగర్‌లో నివాసముంటున్న తమ ఇంటికి స్థానిక చిట్స్ సంస్థ బ్రాంచి మేనేజర్ విశాఖపట్నం జిల్లా వ్యక్తులతో కలిసివచ్చి పెట్రోల్ పోసి బెదిరించారంటూ దంపతులు రెండో పట్టణ పోలీసులను ఆశ్రయించారు. బాధితులు తెలిపిన వివరాల మేరకు.. ప్రకాష్‌నగర్‌లో నివసిస్తున్న కరకవలస రమ 2012 నుంచి నగరంలోని ఓ చిట్స్ కంపెనీలో(బ్రాంచి) ఆఫీస్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. భర్త సత్యనారాయణ ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నారు. భర్త మేనకోడలు వివాహ నిమిత్తం చిట్టీ కట్టే ఆలోచనతో రమ నగరంలోనే తమ సంస్థకు చెందిన మరో బ్రాంచికి వెళ్లి అక్కడి మేనేజర్‌ను సంప్రదించింది. అక్కడ కూడా తమ పేరిట చిట్టీ కట్టడం వీలు కాకపోవడంతో తన భర్త స్నేహితుడు కిల్లి గుణశేఖర్ పేరున చిట్టీలు కట్టడం ఆరంభించారు. ఈ క్రమంలో నెలకు రూ.50 వేలు చొప్పున 50 నెలలు రూ.25 లక్షల చిట్టీ కట్టేందుకు సమాయత్తమై 30 నెలల చిట్టీ (సుమారు రూ.15 లక్షలు) కట్టారు. ఈలోగా డబ్బులు అవసరమై 2023 నుంచే తమకు పాట దక్కించాలని మేనేజర్‌ను ఆశ్రయించారు. అదే ఏడాది మేలో పాట ఇప్పిస్తానని చెప్పినా ఇప్పించలేదు. బయట రూ.1.50 వడ్డీకి రూ.7 లక్షలను మేనేజర్ ఇప్పించాడు. నెల నెలా వడ్డీ భారం, ఇంట్లో బాధలు తట్టుకోలేక బాధిత దంపతులు తమకు ఎలాగైనా పాట ఇప్పించమని మళ్లీ ప్రాధేయపడ్డారు. దీనికి మేనేజర్ స్పందిస్తూ అసలు రూ. 7 లక్షలకు అదనంగా మరో రూ. 7 లక్షలు ఇస్తేనే చీటీ ఇప్పిస్తానని, అంతకుముందుగా తన డబ్బులు కట్టాలని డిమాండ్ చేశాడు. లేకపోతే కుమారుడిని కిడ్నాప్ చే స్తానని బెదిరించాడు. ఈ క్రమంలో శనివారం మధ్యాహ్నం 2:30 గంటలకు సత్యనారాయణ ఇంట్లో భోజనం చేస్తుండగా మేనేజర్ విశాఖకు చెందిన తన మనుషులతో చొరబడి హంగామా చేశాడు. సత్యనారాయణ ఒంటిపై పెట్రోల్‌ను పోయడంతో బాధితుడు కేకలు వేయగా స్థానికులు చేరడంతో అక్కడి నుంచి పరారయ్యారు. రెండో పట్టణ సీఐ ఈశ్వరరావుతో మాట్లాడేందుకు ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు.

డిసెంబర్ నుంచి ధాన్యం కొనుగోలు

- మంత్రి కృష్ణచంద్ర పాత్రో


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కృష్ణచంద్ర పాత్రో

పర్లాకిమిడి: రైతులు ఖరీఫ్‌లో పండించిన ధాన్యాన్ని డిసెంబర్ నెల నుంచి కొనుగోలు చేయనున్నట్టు రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల సంక్షేమ శాఖ మంత్రి కృష్ణచంద్ర పాత్రో వెల్లడించారు. శనివారం గజపతి జిల్లాలోని కాశీనగర్, గుమ్మా, ఉప్పలాడలో పర్యటించి ధాన్యం కొనుగోలు కేంద్రాల (మండీ)ను పరిశీలించారు. డిసెంబర్ నుంచి జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు తెరుస్తున్నట్టు చెప్పారు. అనంతరం కలెక్టరేట్‌లో పాలనాధికారి, పౌరసరఫరాల శాఖ అధికారులతో సమీక్షించారు. సమావేశానికి పర్లాకిమిడి ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి, సీఎస్‌వో, జిల్లా మేనేజరు ప్రఫుల్లకుమార్ బెహారా, సబ్‌కలెక్టర్ అనుప్ పండా, కోపరేటివ్ సబ్ రిజిస్ట్రారు పాల్గొన్నారు. గజపతి జిల్లాలో ప్రస్తుతం ఉన్న మండీలు రైతులకు అందుబాటులో లేవన్నారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో ఉన్న ధాన్యం కొనుగోలు కేంద్రాల వలే మండీలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ బిజయకుమార్ దాస్‌కు రాష్ట్ర మంత్రి పాత్రో ఆదేశించారు. క్వింటా ధాన్యాన్ని రూ.3031 చొప్పున రైతుల నుంచి కొనుగోలు చేయాలని స్పష్టం చేశారు. సమావేశంలో గుసాని సమితి అధ్యక్షుడు ఎస్.వీ రాజు, జెడ్పీటీసీ ఎస్.బాలరాజు పాల్గొన్నారు.


పాల్గొన్న వివిధ శాఖల అధికారులు

ప్రొటోకాల్ పాటించాలని వినతి


పీఈఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయబ్ సర్పంచ్, వార్డు సభ్యులు

రాయగడ: పంచాయతీ స్థాయిలో జరిగే అభివృద్ధి పనులకు సంబంధించి తమకు ఎటువంటి సమాచారాన్ని ఇవ్వడం లేదని జిల్లాలోని కళ్యాణ సింగుపూర్ సమితి సికరపాయి పంచాయతీలోని నాయబ్ సర్పంచ్, వార్డు సభ్యులు ఆరోపిస్తున్నారు. ప్రొటోకాల్ పాటించాలని పంచాయతీ కార్యనిర్వాహక అధికారి ప్రశాంత్ కుమార్ సాహుకు శనివారం వినతిపత్రం అందజేశారు. సర్పంచులు బాధ్యతలు చేపట్టి మూడేళ్లు అయినా పంచాయతీల్లో ఎలాంటి అభివృద్ధి పనులు జరగడం లేదన్నారు. నెలవారీ సమావేశాల్లో ముందస్తుగా తమకు ఎటువంటి సమాచారాన్ని ఇవ్వడం లేదన్నారు.నాయబ్ సర్పంచ్ ఆర్.పుష్పారాణి, వార్డు సభ్యులు సాగంతి కౌసల్య, అనిల్ వ్వక, కె.చలపతి, నరసింహ స్వాయి, సమదార్ మినియాక, అనసూయ నెమల్‌పూరి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఆత్మరక్షణ శిక్షణ శిబిరం


శిక్షణ పొందుతున్న విద్యార్థినులు

జయపురం: స్థానిక ప్రభుత్వ మహిళా కళాశాలలో గత నెల 28 నుంచి నిర్వహిస్తున్న ఆత్మ రక్షణ శిక్షణ శిబిరం శనివారంతో ముగిసింది. మాస్టర్ ట్రైనర్లు తరంగిలత షొడంగి, జితు సాహు విద్యార్థినులకు కరాటే, ఎరోబిక్, ఎన్‌రోబిక్‌పై శిక్షణ ఇచ్చారు. ప్రమాద సమయాలలో శిక్షణను వినియోగించి తమకు తాము రక్షించుకోవచ్చని మాస్టర్ ట్రైనీ తరంగిలత వివరించారు. 60 మంది డిగ్రీ విద్యార్థినులు శిక్షణ పొందినట్లు వెల్లడించారు. మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మనోరంజన్ సున పర్యవేక్షణలో నిర్వహించిన శిక్షణకు కోఆర్డినేటర్‌గా రాజ్యలక్ష్మి బోల్ సహకారం అందించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. సమాజంలో విద్యార్థినులపైన, యువతులపైన అత్యాచారాలు పెరుగుతున్నాయన్నారు. ఢిల్లీలో జరిగిన నిర్భయ కాండ తరువాత విద్యార్థినుల్లో అధికశాతం మంది ఆత్మ రక్షణ శిక్షణ తీసుకుంటున్నారని వివరించారు. ప్రతి విద్యార్థిని ఆత్మ రక్షణ శిక్షణ పొందిన నాడే దుండగుల నుంచి, ప్రమాదాలలోనూ తమను తాము రక్షించుకోగలరన్నారు.

ఔషధ మొక్కల పెంపకంపై శిక్షణ


మాట్లాడుతున్న డైరెక్టర్ ప్రశాంత పారిడ


శిక్షణ శిబిరంలో పాల్గొన్న రైతులు

జయపురం: ఫూల్‌బెడ గ్రామంలోని ఎం.ఎస్.స్వామినాథన్ రిసెర్చ్ ఫౌండేషన్ కేంద్రంలో సుగంధ ద్రవ్య, ఔషధ మొక్కల పెంపకం రైతులకు శనివారం శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని రిసెర్చ్ ఫౌండేషన్ జయపురం, సీఎస్ఆర్ఆర్, ఐఎంఎంటీ భువనేశ్వర్, సీఎస్ఆర్ఆర్, సిబ ఎంఏపీ లక్నో, ఉత్తరప్రదేశ్ సంయుక్తంగా నిర్వహించాయి. ఎమ్.ఎస్.స్వామినాథన్ రిసెర్చ్ కేంద్రం జయపురం డైరెక్ట్ ప్రశాంత కుమార్ పారిడ మాట్లాడుతూ ఔషధ మొక్కల పెంపకం, వాటి విలువలను వివరించారు. రానున్న కాలంలో ఒడిశాలో సుగంధ, ఔషధ మొక్కల పెంపకాన్ని పెంచాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. రైతుల ఆర్థిక వికాశానికి సుగంధ, ఔషధ మొక్కల వ్యవసాయం ఎంతో ఉపకరిస్తుందన్నారు. ఎం.ఎస్.స్వామినాథన్ రిసెర్చ్ కేంద్ర వైజ్ఞానికులు డాక్టర్ కార్తీక చంద్ర లెంక ముఖ్య అతిథిగా హాజరై సుగంధ, ఔషధ మొక్కల పెంపకం, వాటి పరిరక్షణను వివరించారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్ర లక్నో సీనియర్ వైజ్ఞానికులు డాక్టర్ ప్రశాంత కుమార్ రౌత్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రుల్లో ధూమపానం వద్దు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కేంద్రంలో ఉన్న ప్రభుత్వాస్పత్రిలో ధూమపానం చేసినా గుట్కా తిన్నా చర్యలు తీసుకుంటామని నేషనల్ టొబాకో ఇన్‌స్పెక్షన్ సెల్ ఫుడ్ సేఫ్టీ విభాగం అధికారి ప్రభాస్ కుమార్ శేతి హెచ్చరించారు. ఆయన ఆస్పత్రి ఆవరణలో దుకాణాలు పరిశీలించి గుట్కా, సిగరెట్ వంటి పదార్థాలను స్వాధీనం చేసుకుని 15 మంది వ్యాపారులకు జరిమానా విధించారు. మెడికల్ సెంటర్ పరిధిలో 200 మీటర్లు డ్రగ్స్ ఫ్రీ జోన్‌గా ప్రకటించాలని సూచించారు.

క్లుప్తంగా


వెంకన్నను దర్శించుకున్న జబర్దస్ నటుడు



భర్తాపురం వెంకన్నస్వామి సన్నిధిలో బుల్లితెర నటుడు సత్తిపండు

శృంగవరపుకోట: బుల్లితెర నటుడు జబర్దస్త్ ఫేం సత్తిపండు మండలంలో భర్తాపురం గ్రామంలోని కల్యాణ ప్రసన్న వైభోగ వేంకటేశ్వరస్వామిని శనివా రం దర్శించుకున్నారు. అరుకులో షూటింగ్ కోసం వెళ్తున్న సత్తిపండు మార్గ మధ్యంలో ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయానికి వెళ్లారు. ఆలయ నిర్వాహకులు సత్తిపండుకు స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేయించి, తీర్ధ ప్రసాదాలను అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెంకన్న స్వామి కృప వల్ల తాను ఈ స్థాయిలో ఉన్నానంటూ చెప్పారు.

దిబ్బగూడలో పూరిల్లు దగ్ధం



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

సీతంపేట: మండలంలోని కీసరజోడు పంచాయతీ దిబ్బగూడ గ్రామంలో శనివారం జరిగిన అగ్ని ప్రమాదంలో సున్నాపురం నాగరాజుకు చెందిన పూరిల్లు దగ్ధమైంది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరగడంతో అగ్ని ప్రమాదం సంభవించిందని స్థానికులు తెలిపారు. కొత్తూరు అగ్నిమాపక శకటం మంటలను అదుపు చేసింది. ఇంట్లో ఉన్న బియ్యం, ధాన్యం, ఇతర సామగ్రి కాలి బూడిదయ్యాయని బాధితులు తెలిపారు. సుమారు రూ.50వేలు ఆస్తి నష్టం సంభవించినట్టు అంచనా వేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్ర గాయాలు



ప్రమాదంలో గాయపడిన సంతోషిని చికిత్స కోసం తరలిస్తున్న 108 సిబ్బంది

గంట్యాడ: మండలంలోని నరవ జంక్షన్ వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పెనసాం గ్రామానికి చెందిన మహిళ తీవ్రంగా గాయపడింది. ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో గ్రామానికి చెందిన కె.సంతోషి తీవ్రంగా గాయపడింది. చికిత్స కోసం 108 వాహనంలో విజయనగరంలోని మహారాజా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

మద్యం దుకాణంపై మహిళల నిరసన



వల్లంపూడి స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న మహిళలు

వేపాడ: మండల కేంద్రంలో మద్యం దుకాణాన్ని గృహావాసాల మధ్య పెట్టడంపై మహిళలు శనివారం నిరసన వ్యక్తం చేశారు. వేపాడలోని మధు బుక్ సెంటర్ ఎదురుగా ఉన్న గదిలో మద్యం దుకాణం పెట్టేందుకు ప్రయత్నించగా స్థానికులు అడ్డుకున్నారు. ఈ ప్రాంతంలో మద్యం దుకాణం పెడితే తామంతా ఇబ్బంది పడతామని తెలిపారు. అనంతరం వల్లంపూడి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లిన మహిళలు తమ ఇబ్బందులు వివరించి ఫిర్యాదు చేశారు.

కొట్లాట కేసు నమోదు

విజయనగరం క్రైమ్: స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలో ఆర్టీసీ కాంప్లెక్స్ వెళ్లే రహదారి వద్ద శనివారం రాత్రి కొట్లాట జరిగింది. దీనికి సంబంధించి వన్‌టౌన్ ఎస్‌ఐ నరేష్ శనివారం అందించిన వివరాలిలా ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలస మున్సిపాలిటీ మెట్టక్కివలస బలివాడవారి వీధికి చెందిన గొర్లె రాంబాబుతో పాటు యాచకవృత్తి చేస్తూ జీవనం సాగిస్తున్న ఓ మహిళ, ఆమె భర్త నూడిల్స్ తింటున్నారు. ముగ్గురూ మద్యం సేవించి ఉన్నారు. రాంబాబు వీడియో కాల్ చేసి మాట్లాడుతుంటే భార్యాభర్తలిద్దరూ తమ కెందుకు ఫొటోలు తీస్తున్నావంటూ ప్రశ్నించారు. రాంబాబు తను ఫొటోలు తీయలేదని చెప్పినా ఆయనతో వాగ్వివాదానికి దిగారు. అంతటితో ఆగకుండా రాంబాబుపై వారు దాడికి దిగారు. తీవ్రంగా కొట్టడంతో రాంబాబు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు స్పందించి నిలువరింపజేశారు. విషయం తెలుసుకున్న వన్‌టౌన్ ఎస్‌ఐ నరేష్ సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. బాధితుడిని 108 సాయంతో జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. నిందితులను అదుపులోకి తీసుకున్నామని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

సర్వజన ఆస్పత్రిలో...

హెచ్‌సీవీ కిట్ల కొరత


- ఈ పరీక్ష తరువాతే ఆపరేషన్లు
- ప్రైవేటు ల్యాబ్‌లను ఆశ్రయిస్తున్న రోగులు
- రూ.200 నుంచి 300 వరకు ఖర్చు



ఈ ఫొటోలో కనిపిస్తున్న వ్యక్తి పేరు ఎస్.అప్పారావు. ఇతనిది బొబ్బిలి గ్రామం. ఈయన కొంత కాలంగా కడుపు నొప్పి వస్తుండడంతో సర్వజన ఆస్పత్రికి వచ్చారు. అక్కడి వైద్యులు అతన్ని పరీక్షించి హెర్నియాగా గుర్తించి శస్త్రచికిత్స చేయాలని సర్జికల్ ప్రొఫెయిల్‌తో పాటు, హెచ్ఐవి, హెచ్‌బీఎస్ఏజీ, హెచ్‌సీవీ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అది పట్టుకుని ల్యాబొరేటరీ వద్దకు అప్పారావు వెళ్లగా హెచ్‌సీవీ పరీక్ష కిట్లు లేవని బయట చేయించుకోవాలని అక్కడ సిబ్బంది చెప్పడంతో ప్రైవేటు ల్యాబ్‌రేటరీకి ఎక్కడకు వెళ్లాలో తెలియక ఆస్పత్రి కలియతిరిగాడు.



వైద్య పరీక్షల కోసం సర్వజన ఆస్పత్రికి వచ్చిన రోగులు



హెచ్‌సీవీ కిట్టు

కిట్ల కొరత వాస్తవమే..

ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో హెచ్‌సీవీ పరీక్ష కిట్లు కొరత ఉంది. వీటి కోసం ఇప్పటికే ఉన్నతాధికారులకు లేఖ ద్వారా తెలియజేశాం. ఈ కిట్లు ఎన్‌హెచ్ఎం ప్రొగ్రాం ద్వారా సరఫరా అవుతుంటాయి.

– డాక్టర్ సంబంగి అప్పలనాయుడు, సూపరింటెండెంట్, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి

విజయనగరం ఫోర్ట్: సర్వజన ఆస్పత్రిలో హెచ్‌సీవీ పరీక్ష కోసం రోగులు పడరాని పాట్లు పడుతున్నారు. ఇక్కడకు వచ్చే రోగులకు శస్త్రచికిత్స అవసరమైతే వైద్యులు హెచ్‌సీవీ(హెపటైటీస్ సీ వైరస్), హెచ్ఐవీ, హెచ్‌బీఎస్ఏజీ పరీక్షలు చేయించుకోవాలని సూచిస్తారు. వీటిలో ఏ పరీక్ష జరగకపోయినా వారికి శస్త్రచికిత్స చేయరు. వీటిలో ఏ వ్యాధి ఉన్నట్టు నిర్ధారణ జరిగినా వారికి ప్రత్యేకమైన కిట్లు ధరించి ఆపరేషన్లు చేస్తారు.

ప్రైవేట్ ల్యాబ్‌లను ఆశ్రయించాల్సిన పరిస్థితి

ఆస్పత్రిలో హెచ్‌సీవీ కిట్లు కొరత ఉండడంతో ఈ పరీక్ష అవసరమైన రోగులకు ప్రైవేటు ల్యాబ్‌లో చేయించుకోవాలని అక్కడ సిబ్బంది సూచిస్తున్నారు. శస్త్రచికిత్స అవసరమైన ప్రతి ఒక్క రోగి హెచ్‌సీవీ పరీక్ష చేయించుకోవాలి. ప్రతి రోజు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి హెచ్‌సీవీ పరీక్ష కోసం 50 నుంచి 70 మంది వరకు వస్తారు. ఆస్పత్రిలో కిట్లు కొరత వల్ల వీరంతా ప్రైవేటు ల్యాబ్‌లను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. ఆర్థో, కంటి, సర్జికల్, ఈఎన్‌టీ విభాగాలకు సంబంధించి శస్త్రచికిత్సలు చేస్తారు. హెచ్‌సీవీ పరీక్షకు ప్రైవేట్ ల్యాబ్‌లో రూ.200 నుంచి రూ.300 వరకు వెచ్చించి రోగులు చేయించుకుంటున్నారు.

రిపోర్టు లేకుంటే అంతే..

హెచ్‌సీవీ పరీక్ష లేకపోతే సంబంధిత రోగులకు శస్త్రచికిత్సలు జరగని పరిస్థితి. ఈ పరీక్ష రిపోర్టు ఉన్న వారికి శస్త్రచికిత్సలు చేస్తున్నారు. లేని వారికి ఆపరేషన్లు వాయిదా వేస్తున్నారు. హెచ్‌సీవీ ఒకరి నుంచి ఇంకొకరికి వ్యాప్తి చెందుతుంది. ఈ వ్యాధి నిర్ధారణ అయితే వారికి కాలేయం దెబ్బతింటుంది. లివర్ కేన్సర్ వచ్చే అవకాశం ఉంది. ఇటువంటి పరిస్థితుల్లో రోగుల ఇబ్బందులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

పిల్లల ప్రాణాలపై నిర్లక్ష్యం తగదు

- బాలల హక్కుల కమిషన్ ఛైర్మన్ అప్పారావు



ఆస్పత్రిలో వివరాలు సేకరిస్తున్న కమిషన్ ఛైర్మన్ కేసలి అప్పారావు

చీపురుపల్లి: పిల్లల ప్రాణాలపై ఆస్పత్రులు నిర్లక్ష్యం ప్రదర్శించకూడదని నిబంధనల ప్రకారం జాగ్రత్తలు పాటించాలని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ ఛైర్మన్ కేసలి అప్పారావు అన్నారు. పట్టణంలోని బాబూజీ ఆస్పత్రిలో ప్రసవ సమయంలో మగబిడ్డ మృతి చెందిన ఘటనపై శనివారం ఆయన ఐసీడీఎస్ సిబ్బందితో కలిసి ఆస్పత్రికి వచ్చి విచారణ నిర్వహించారు. బిడ్డ మృతికి కారణాలు అడిగి తెలుసుకున్నారు. గర్భిణి ఎప్పుడు ఆస్పత్రిలో చేరింది, ఏ సమయంలో ప్రసవం చేసారు, బిడ్డ ఎలా మృతి చెందింది.. అనే అంశాలపై ప్రశ్నలు వేసారు. పిల్లల కోసం వేలాది దరఖాస్తులు తమ కమిషన్ వద్ద ఉన్నాయని అలాంటిది పిల్లలు ఇలా నిర్లక్ష్యం కారణంగా మృతి చెందడం చాలా బాధాకరమని చెప్పారు. పేదలైనా ధనికులైనా ప్రాణం అందరికీ సమానమేనని గుర్తు చేసుకోవాలన్నారు. గర్భిణి ఆస్పత్రిలో చేరినప్పటి నుంచి సీసీ ఫుటేజీలతో పాటు పూర్తి వివరాలు కమిషన్‌కు సమర్పించాలన్నారు. గర్భిణుల ప్రసవసమయాల్లో మరింత శ్రద్ధ వహించాలన్నారు. ఆస్పత్రుల్లో చేరినప్పుడు వారికి సరైన వైద్యం అందుతుందో లేదో మహిళా పోలీసులు బాధ్యతగా తెలుసుకోవాలన్నారు. ఎంతో గొప్ప ఆశయంతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి గ్రామాల్లో మహిళా పోలీసులను నియమించినట్టు చెప్పారు. మహిళా పోలీసులు సామాజిక బాధ్యతతో విధులు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో గరివిడి ఐసీడీఎస్ ప్రాజెక్టు పీఓ ఎన్.ఆరుద్ర, చైల్డ్ లైన్ సిబ్బంది వి.మీనా, పి.గౌరి, సీహెచ్ అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ అధ్యాపకుల క్రమబద్ధీకరణ సాధన కమిటీ ఏర్పాటు



సాధన కమిటీ నూతన కమిటీ సభ్యులు

విజయనగరం అర్బన్: కాంట్రాక్ట్ అధ్యాపకులు క్రమబద్ధీకరణ సాధన కమిటీని ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న కాంట్రాక్ట్ అధ్యాపకులు స్థానిక ఓ ప్రైవేట్ సమావేశ మందిరంలో శనివారం సమావేశమయ్యారు. జిల్లా కాంట్రాక్ట్ అధ్యాపకుల క్రమబద్ధీకరణ సాధన కమిటీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. క్రమబద్ధీకరణ సాధన కమిటీ గౌరవ అధ్యక్షురాలుగా లంక సంధ్య, కమిటీ గౌరవ సలహాదారులుగా సూర్యనారాయణ, చందక అప్పలనాయుడు, కేవీఎస్ రామారావును ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా శివన్నారాయణ, ప్రధాన కార్యదర్శిగా మండల సూరపనాయుడు, ఉపాధ్యక్షులుగా ఎం.శరత్ కొత్తవలస, బి.అప్పారావు, ప్రధాన కోశాధికారిగా ఎన్.సన్యాసినాయుడు, ఎన్.భద్రావతి, మహిళ కోఆర్డినేటర్ కార్యదర్శులుగా వి.ఉమామహేశ్వరి, శ్యామలాదేవి, మీడియా కన్వీనర్‌గా కరణం రామకృష్ణ, సాంకేతిక సలహాదారుగా రెడ్డి కిషోర్ ఎంపికయ్యారు. నూతన కమిటీ బాధ్యతలు తీసుకున్న అనంతరం జరిగిన సమావేశంలో కాంట్రాక్ట్ అధ్యాపకులు క్రమబద్ధీకరణ సాధనకు విధివిధానాలు, కార్యాచరణ రూపకల్పన చేశారు. సమావేశంలో సూర్యనారాయణ, కేవీఎస్ రామారావు, చందక అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

మైనర్లు వాహనాలు నడిపితే కఠిన చర్యలు

విజయనగరం క్రైమ్: మైనర్లు వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ వకుల్ జిందల్ హెచ్చరించారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లా వ్యాప్తంగా శనివారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఎంవీ నిబంధనలు అతిక్రమించిన 531 వాహనదారుల వాహనాలను సీజ్ చేశారు. స్పెషల్ డ్రైవ్‌ను విజయనగరం డీఎస్పీ ఎమ్.శ్రీనివాసరావు, బొబ్బిలి డీఎస్పీ పి.శ్రీనివాసరావు, చీపురుపల్లి డీఎస్పీ ఎస్.రాఘవులు, ట్రాఫిక్ సీఐ సూరినాయుడు పర్యవేక్షించారు.

లారీ ఢీకొని వ్యక్తి దుర్మరణం



ప్రమాదంలో మృతి చెందిన గౌరినాయుడు మృతదేహం

బొండపల్లి: మండలంలోని రోళ్లవాక జంక్షన్ వద్ద జాతీయ రహదారి 26పై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందాడు. దీనికి సంబంధించి ఎస్ఐ యు.మహేష్ తెలిపిన వివరాలు.. మండలంలోని నెలివాడ గ్రామానికి చెందిన లోగిస గౌరినాయుడు(50) విజయనగరంలోని ఆర్అండ్‌బీ వద్ద ఉన్న రైతుబజారులో కూరగాయలు రోజూ విక్రయిస్తూ ఇంటికి వస్తుంటాడు. రోజూ లాగే శనివారం కూడా తన బైక్‌పై విజయనగరం నుంచి నెలివాడకు గోట్లాం గ్రామానికి చెందిన మీసాల ఈశ్వరరావుతో కలిసి వస్తుండగా గజపతినగరం నుంచి విజయనగరం వైపు వెళ్తున్న లారీ అదుపు తప్పి బైక్‌ను బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో గౌరినాయుడు తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈశ్వరరావుకు తీవ్ర గాయాలు కావడంతో 108 వాహనంలో విజయనగరంలోని మహారాజ కేంద్ర ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య అప్పలసూర్యంతో పాటు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కేసు దర్యాప్తు నిర్వహిస్తున్నట్టు చెప్పారు.

హత్య కేసులో నిందితుడి అరెస్ట్

- కక్ష కట్టి హత్య చేసిన స్నేహితుడు
- పోలీసుల వెల్లడి



మాట్లాడుతున్న సీఐ రవికుమార్, వెనుక ముసుగులో నిందితుడు

జామి: మండలంలోని విజినిగిరి గ్రామంలో రెండు రోజుల కిందట జరిగిన యువకుడి హత్య కలకలం రేపిన సంగతి పాఠకులకు విదితమే. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను జామి పోలీస్‌స్టేషన్‌లో సీఐ రవికుమార్, ఎస్ఐ వీరజనార్ధన్ శనివారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. విజినిగిరి గ్రామానికి చెందిన గనివాడ అచ్చింనాయుడు, వి.సూరిబాబు స్నేహితులు. రెండు నెలల కిందట సూరిబాబు గ్రామంలో ఒక సెల్‌ఫోన్‌ను దొంగిలించాడు. దీన్ని అచ్చింనాయుడుకు అమ్మేయమని ఇచ్చాడు. అచ్చింనాయుడు జామిలో ఒక సెల్‌షాపులో సెల్‌ఫోన్‌ను విక్రయించాడు. బాధితులు పోలీసులకు అప్పట్లో ఫిర్యాదు చేయడంతో సెల్‌ఫోన్ పట్టుకున్నారు. ఈ ఘటనపై గ్రామ పెద్దలు నగదు, సెల్‌ఫోన్‌కు సంబంధించి ఇద్దరూ చెరో రూ.3వేలు చొప్పున ఇవ్వాలని జరిమాన విధించారు. దీన్ని సహించలేని సూరిబాబు అచ్చింనాయుడుపై చిందులేశాడు. నా పేరు ఎందుకు బయటపెట్టావు..నిన్ను చంపుతానని రెండు నెలల కిందట బెదిరించాడు. దీంతో అచ్చింనాయుడు రెండు నెలల పాటు గ్రామంలో లేకుండా వెళ్లిపోయాడు. ఈ నెల 7న గ్రామానికి మళ్లీ వచ్చాడు. ఈ క్రమంలో సూరిబాబు అచ్చింనాయుడును కలిసి జరిగింది మరచిపోదాం.. అని చెప్పడంతో వారిద్దరూ గ్రామంలోని బెల్ట్ షాపునకు వెళ్లి మద్యం సేవించి గురువారం గొడవ పడ్డారు. ఈ క్రమంలో సూరిబాబు గురువారం రాత్రి అచ్చింనాయుడుపై దాడి చేసి బలంగా కొట్టి చంపేశాడు. అచ్చింనాయుడు మృతదేహాన్ని గ్రామ సమీపంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద పడేశాడు. విద్యుత్ షాక్‌తో మృతి చెందినట్టు చిత్రీకరించాడు. జరిగిన ఘటనపై మృతుడి అక్క కొండమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీఐ రవికుమార్ విచారణ జరిపి నిందితుడు సూరిబాబును అదుపులోకి తీసుకుని విచారించారు. దీంతో అచ్చింనాయుడును తానే కక్షగట్టి హత్య చేసినట్టు ఒప్పుకున్నాడు. నిందితుడిని విలేకరుల సమావేశంలో పోలీసులు ప్రవేశపెట్టారు. నిందితుడిని రిమాండ్‌కు పంపనున్నట్టు సీఐ రవికుమార్ తెలిపారు.

డ్రాగా ముగిసిన రంజీ మ్యాచ్



ఆంధ్రా - ఉత్తరాఖండ్ జట్ల మధ్య జరుగుతున్న మ్యాచ్



బ్యాటింగ్ చేస్తున్న ఆంధ్రా ఆటగాళ్లు

విజయనగరం: ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగిన ఆంధ్రప్రదేశ్ – ఉత్తరాఖండ్ జట్ల మధ్య రంజీ క్రికెట్ మ్యాచ్ డ్రాగా ముగిసింది. గత నాలుగు రోజులుగా డెంకాడ మండలం చింతలవలసలో గల డాక్టర్ పీవీజీ రాజు ఏసీఏ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఆవరణలో జరుగుతున్న మ్యాచ్‌లో చివరి రోజు రెండవ ఇన్నింగ్స్ బ్యాటింగ్ ప్రారంభించిన ఆంధ్రప్రదేశ్ జట్టు క్రీడాకారులు ఉత్తరాఖండ్ బౌలర్లను సమర్థవంతంగా తిప్పికొట్టడంలో సఫలమయ్యారు. 4.1 ఓవర్లలో వికెట్ నష్టపోయి 8 పరుగులు ఓవర్‌నైట్ స్కోరు వద్ద నాల్గవ రోజు శనివారం రెండవ ఇన్నింగ్స్ బ్యాటింగ్ ప్రారంభించిన ఆంధ్ర జట్టు ఆట ముగిసే సమయానికి 93 ఓవర్లలో 6 వికెట్లు నష్టపోయి 286 పరుగులు చేసింది. జట్టు బ్యాటింగ్‌లో కెప్టెన్ ఎస్‌కె.రషీద్ 60 బంతుల్లో 31 పరుగులు, కరణ్ షిండే 171 బంతుల్లో 65 పరుగులు, హనుమ విహారి 189 బంతుల్లో 66 పరుగులు, కెఎస్.భరత్ 90 బంతుల్లో 92 పరుగులతో రాణించారు. చివరి రోజు మ్యాచ్ ఫలితం తేలకపోవటంతో అంపైర్‌లు మ్యాచ్‌ను డ్రాగా ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్ జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 56.3 ఓవర్లలో 146 పరుగులకే ఆలౌటైన విషయం విదితమే. అదే విధంగా మొదటి ఇన్నింగ్స్‌లో ఉత్తరాఖండ్ జట్టు మొత్తం 135.2 ఓవర్లలో 338 పరుగులకు ఆలౌట్ కాగా... రెండవ ఇన్నింగ్స్‌లో 49 ఓవర్లలో 9 వికెట్లు నష్టానికి 128 పరుగుల వద్ద డిక్లేర్ ప్రకటించింది.

అర్హులంతా ఓటు హక్కు పొందాలి

- కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్



గొండయ్యపాలెం పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్



గొండయ్యపాలెంలో పోలింగ్ కేంద్రం వద్ద వివరాలు పరిశీలిస్తున్న కలెక్టర్ అంబేడ్కర్

డెంకాడ: అర్హులైన వారంతా ఓటు హక్కు పొందాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అన్నారు. డెంకాడ మండలం మోదవలస పంచాయతీలోని గొండయ్యపాలెం ప్రాథమిక పాఠశాలలో బూత్ నంబర్ 17ను కలెక్టర్ శనివారం పరిశీలించారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను తనిఖీ చేశారు. బూత్ పరిధిలో ఓటర్ల సంఖ్య, కొత్తగా వచ్చిన దరఖాస్తులు తదితర అంశాలపై బీఎల్ఓను ఆరా తీశారు. ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని, ముఖ్యంగా యువ ఓటర్లకు అవగాహన కల్పించి, వారు ఓటు కోసం దరఖాస్తు చేసుకునేలా చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. వచ్చే ఏడాది జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండే ప్రతి ఒక్కరూ ఓటు హక్కు పొందేందుకు దరఖాస్తు చేయాలన్నారు. ఇందుకోసం నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ – 2025 కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని ఆయన సూచించారు. ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 9, 10 తేదీల్లో అలాగే 23, 24 తేదీల్లో జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ ప్రత్యేక తేదీల్లో బీఎల్ఓ అంతా ఇక్కడ అందుబాటులో ఉంటారని తెలిపారు.

పాఠశాల సందర్శించిన కలెక్టర్

ఈ సందర్భంగా కలెక్టర్ అంబేడ్కర్ పాఠశాలను సందర్శించారు. విద్యార్థులతో ముచ్చటించారు. మధ్యాహ్నం భోజన పథకం నిర్వహణపై ఆరా తీశారు. ఆర్వో వాటర్ ప్లాంట్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ నూకరాజు, తహసీల్దార్ పద్మావతి, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రాములోరి సేవలో హైకోర్టు న్యాయమూర్తులు



హైకోర్టు న్యాయమూర్తులు జయసూర్య, సురేష్‌రెడ్డికి ఆహ్వానం పలుకుతున్న ఆలయ అర్చకులు, అధికారులు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం శ్రీ సీతారామస్వామిని ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఎన్.జయసూర్య, జస్టిస్ కె.సురేష్ రెడ్డి శనివారం దర్శించుకున్నారు. ఆలయ సంప్రదాయం ప్రకారం అర్చకులు వారికి ఆహ్వానం పలికారు. ముందుగా ఆంజనేయ స్వామిని దర్శించుకున్న తరువాత శ్రీరామచంద్రమూర్తి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేద మంత్రోచ్ఛరణలతో అర్చకులు ప్రత్యేక ఆశీర్వచనాలు అందించి తీర్థ ప్రసాదాలు, స్వామివారి చిత్ర పటాలను అందజేశారు. ఈ సందర్భంగా రామక్షేత్ర మహత్యాన్ని అర్చకులు న్యాయమూర్తులకు వివరించారు. ఈఓ వై.శ్రీనివాసరావు, రెవెన్యూ, పోలీస్ అధికారులు, జిల్లా కోర్టు ప్రతినిధులు పాల్గొన్నారు.

వ్యాన్ కేబిన్‌లో నుంచి జారిపడి డ్రైవర్ మృతి

రేగిడి: ఉంగరాడ మెట్ట వద్ద ఉన్న ఓ ప్రైవేటు కర్మాగారం వద్ద ఆగి ఉన్న వ్యాన్‌లో నిద్రిస్తున్న వ్యక్తి ప్రమాదవశాత్తు శుక్రవారం అర్ధరాత్రి దాటిన తరువాత కిందపడి మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ పి.నీలావతి తెలిపిన వివరాలు.. విశాఖపట్నం జిల్లా కె.కోటపాడు మండలం కోడూరు అగ్రహారానికి చెందిన జోగి గోవింద (55) ఒడిశా రాష్ట్రం బరంపురం నుంచి ఐచర్ వ్యాన్‌తో తవుడు లోడుతో వచ్చాడు. శుక్రవారం రాత్రి మద్యం సేవించి క్యాబిన్‌లోనే నిద్రించాడు. నిద్ర మత్తులో గోవింద్ కింద పడిపోవడంతో కాలు స్టీరింగ్‌లో ఇరుక్కుని వేలాడుతూ ఉండిపోయాడు. శనివారం కుటుంబ సభ్యులు గోవింద్‌కు ఫోన్ చేసినప్పటికీ విషయం తెలియరాలేదు. విషయాన్ని స్థానిక కర్మాగార సిబ్బందికి తెలియజేశారు. వారు వెళ్లి చూడగా ఐషర్ వ్యాన్‌లో గోవింద ఇరుక్కుని పడి ఉండడాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యులతో కలసి సంఘటనా స్థలానికి వెళ్లిన పోలీసులు పరిశీలించగా అప్పటికే మృతి చెందాడని ఎస్ఐ తెలిపారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

ఏఐ నైపుణ్యాలతో ఉపాధి



ఏఐ అనలిస్ట్ దేవి పవన్‌ను సత్కరిస్తున్న కళాశాల సిబ్బంది

- ప్లాన్ ఫర్ ది పిన్నాకిల్ సెమినార్‌లో ఐటీ ఎనలిస్ట్

విజయనగరం అర్బన్: యువత ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఇంజినీరింగ్ కోర్సుతో ఉద్యోగ, ఉపాధ్యాయ అవకాశాలు సాధించవచ్చని టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఎనలిస్టు భాను పవన్ అన్నారు. సీతం ఇంజినీరింగ్ కళాశాలలో 'ప్లాన్ ఫర్ ది పిన్నాకిల్ ' అనే అంశంపై శనివారం నిర్వహించిన సెమినార్‌లో ఆయన ముఖ్యవక్తగా పాల్గొన్నారు. ఏఐ సాంకేతికతపై విద్యార్థులు, అధ్యాపకులు అవగాహన పెంచుకోవాలని సూచించారు. పరిశ్రమలు, రోజువారీ జీవితంలో ఏఐ ప్రభావాన్ని వివరించారు. డేటా ప్రాసెసింగ్, ప్రిడిక్టివ్ అనలిటిక్స్, ఆటోమేషన్ వంటి క్షేత్రాల్లో ఏఐ అవసరాన్ని తెలియజేశారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు మాట్లాడుతూ విద్యార్థులు సాంకేతిక రంగంలో ప్రస్తుతం ఉన్న పోటీని తట్టుకునేందుకు ఏఐ వంటి ఆధునిక సాంకేతికతలో నైపుణ్యం పెంపొందించుకోవాలని సూచించారు. చివరిలో పవన్‌ను కళాశాల సిబ్బంది సత్కరించారు.